క్లుప్తంగా

ఇస్కాన్ మందిర నమూనా ఆవిష్కరణ



ఇస్కాన్ మందిర నమూనా చిత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: అమలాపురం మండలం జనుపల్లెలో నిర్మించనున్న అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) నూతన మందిర నమూనా చిత్రాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం ఉదయం ఆవిష్కరించారు. మంత్రి విశ్వరూప్ క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అమలాపురం ఇస్కాన్ అవుట్ పోస్ట్ సెంటర్ కోఆర్డినేటర్ శివానంద నిమయిదాస్ మంత్రికి మందిర నిర్మాణం గురించి వివరించారు. పచ్చని కోనసీమలో ఇస్కాన్ వంటి ఆధ్యాత్మిక సంస్థ శ్రీకృష్ణ మందిరం నిర్మించేందుకు ముందుకు రావడం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టమని మంత్రి విశ్వరూప్ అన్నారు. ఇస్కాన్ మందిరానికి ప్రభుత్వం నుంచి 54 సెంట్ల భూమిని అందించిన మంత్రి విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు శివానంద నిమయి దాస్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అనురాధను కలిసిన లీగల్ సెల్ అధ్యక్షుడు అశోక్



లీగల్ సెల్ అధ్యక్షుడు అశోక్‌ను సత్కరిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన కుడుపూడి అశోక్ మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ అనురాధను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన అశోక్‌ను ఎంపీ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసరాల అందజేత



హరి మనోవికాస కేంద్రంలో చిన్నారులకు నిత్యావసరాలు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సోమవారం నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పట్టణంలోని లూయీ అంధుల పాఠశాల, హరి మనోవికాస కేంద్రం, ఇమ్మిడి వరప్పాడు వృద్ధాశ్రమంలో బియ్యంతో పాటు ఇతర నిత్యావసర వస్తువులు అందజేశారు. స్థానిక ఈదరపల్లిలోని కమ్యూనిటీ హాలులో లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, పట్టణ సంఘం అధ్యక్షుడు కల్లేపల్లి గోవిందు, సురేష్, నేదునూరి తరుణ్ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.11,116 విరాళం



అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న దాత రవితేజ

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టు కోసం దాత దివిలి హరిహర కృష్ణ సర్వారాయ రవితేజ రూ.11,116 నగదును ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేష వస్త్రం అందజేసి సత్కరించారు.

కాలుష్యంతో జీవితాలు నాశనం

అమలాపురం రూరల్: కాలుష్యం వల్ల జీవితాలు నాశనమవుతున్నాయని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోలిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం అమలాపురం వచ్చిన ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం లేకపోవడం వల్ల మానవ మనుగడకే ప్రమాదమన్నారు. కాటన్ పార్కును బార్‌గా మార్చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డీఎంఆర్ శేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సౌధం... అభివృద్ధి పథం

- నాడు-నేడుతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి మహర్దశ
- ప్రగతి దిశగా అమలాపురం పెద్దాసుపత్రి
- రూ.5.72 కోట్లతో పూర్తి ఆధునీకరణ



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

అమలాపురం టౌన్: కోనసీమ వ్యాప్తంగా పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించే ప్రభుత్వ పెద్దాసుపత్రికి జిల్లా కేంద్రం అయ్యాక మరింత ప్రాధాన్యం పెరిగింది. అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రి ఒకప్పుడు అరకొర సౌకర్యాలతో ఉండేది. ఇప్పుడు నాడు-నేడు పథకంలో రూ.5.72 కోట్ల పూర్తి ఆధునీకరణ దిశగా అడుగులు వేస్తుంది. నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే డిసెంబర్ నాటికి ఆస్పత్రి పూర్తి మౌలిక సదుపాయాలతో అందుబాటులోకి రానుంది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీ రాణి పనులను పర్యవేక్షిస్తున్నారు.

అభివృద్ధి పనులు ఇలా

దాదాపు 25 ఏళ్ల కిందట నిర్మించిన పెద్దాసుపత్రి భవన సముదాయం పలు చోట్ల శిథిలావస్థకు చేరుకుంది. జీ ప్లస్-2గా నిర్మించిన భవనం కింది ఫ్లోర్‌లో పలు విభాగాలకు మరమ్మతులు చేపట్టారు. అలాగే రెండో అంతస్తులో పూర్తి ఆధునీకరణ చేస్తున్నారు. బాత్ రూమ్‌లు, టైల్స్, ఎలక్ట్రికల్ వైరింగ్, గుమ్మాలు, తలుపులు ఇలా సమస్త పరికరాలను మార్చి కొత్తవి అమర్చుతున్నారు. ఇక రెండో అంతస్తులో ఆపరేషన్ థియేటర్లు, వివిధ విభాగాల వార్డులను ఆధునీకరిస్తున్నారు. పాడైన బెడ్స్ స్థానంలో కొత్త బెడ్స్ వేస్తున్నారు. ఒక్కో వైద్య విభాగానికి ఒక్కో చాంబర్‌ను ఏర్పాటుచేసి అభివృద్ధి చేస్తున్నారు. రోగులు వేచి ఉండే హాలు, ఓపీలు తీసుకునే హాలు, రోగులను పరీక్షించే గదులు, ఫార్మాసిస్ట్, పలు టెస్ట్‌లకు సంబంధించిన ల్యాబోరేటరీలు ఇలా ప్రతి విభాగాన్ని అభివృద్ధి పరుస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ పెద్దాసుపత్రి అభివృద్ధిని విస్మరించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం అభివృద్ధి బాటన పట్టించింది. రోజుకు 400 నుంచి 500 మంది అవుట్ పేషెంట్లతో వంద పడకల ఆస్పత్రిగా 12 వైద్య విభాగాలతో 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సేవలు అందిస్తోంది. భవిష్యత్‌లో జిల్లా సర్వజనాసుపత్రిగా రూపాంతరం చెందే ఈ పెద్దాసుపత్రికి ఇప్పుడు నాడు-నాడు నిధులతో అంకురార్పణం జరగడం అభినందనీయమని కోనసీమ ప్రజలు అంటున్నారు.



ఆస్పత్రిలో జరుగుతున్న నాడు-నేడు ఆధునీకరణ పనులు

నాడు-నేడుతో సకల వసతులు



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా సకల వసతులు కల్పిస్తోంది. ప్రధానంగా మరమ్మతులకు గురైన ఎలక్ట్రికల్ వైరింగ్, ఫ్లోరింగ్ టైల్స్, బాత్‌రూమ్స్ వంటివి ఆధునీకరిస్తున్నారు. కోనసీమలోని ఎక్కడెక్కడి నుంచి వైద్య సేవల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు పూర్తి సౌకర్యవంతంగా ఆసుపత్రి రూపురేఖలు మారుతున్నాయి.

– డాక్టర్ కె.శంకరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

ఆలయాల వద్ద అన్నసమారాధనలు

తాళ్లరేవు: గణపతి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో మండలంలోని పలు గణపతి ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. ప్రధానంగా సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో శ్రీలక్ష్మీగణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం జరిగింది. సుంకరపాలెం, యానాం, ఉప్పంగల, ఇంజరం, గోవలంక, పిల్లంక, జార్జిపేట, నీలపల్లి తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. పి.మల్లవరం వరసిద్ధి వినాయక ఆలయం వద్ద అన్నదానం చేశారు.

రామన్నకోడులో భారీ అన్నదానం

యానాం: స్థానిక నియోజకవర్గ పరిధిలోని మెట్టకూరు రామన్నకోడులో గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని వరసిద్ధి వినాయకుని ఆలయం వద్ద సోమవారం అన్న సమారాధనను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో గొల్లపల్లి వీర్రాజు, పెండెం సూర్యప్రకాష్, చింతా శివ, కాటంశెట్టి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సుంకరపాలెం జంక్షన్‌లో నిర్వహించిన అన్నసమారాధన

గణపతి లడ్డూ రూ.19,116

అమలాపురం టౌన్: వినాయక నవరాత్ర ఉత్సవాల సందర్భంగా స్థానిక నల్లా వీధి యువసేన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయ గణపతి పందిరిలో ఉంచిన లడ్డూకు సోమవారం వేలం పాట నిర్వహించారు. పట్టణానికి చెందిన రెడ్డి సతీష్ దంపతులు వేలంలో లడ్డూను రూ.19,116కు పాడుకుని సొంతం చేసుకున్నారు. అనంతరం గణపతి ఊరేగింపు, నిమజ్జనోత్సవం వైభవంగా జరిగాయి. నల్లా వీధి పెద్దలు ఆశెట్టి ఆదిబాబు, కోన స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి

ముమ్మిడివరం: రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన పెంపొందించుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రెహంతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీలో సోమవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యం, అహింస సిద్ధాంతాలను నమ్మి దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపించిన మహోన్నత వ్యక్తి మహాత్మాగాంధీ అన్నారు. అనంతరం ప్రాథమిక హక్కులు, విధులు, ఉచిత న్యాయం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్వీ ప్రసాదరావు, కమిషనర్ జి.లోవరాజు, గుత్తుల శ్రీనివాసరావు, దాసరి సత్యనారాయణ, టి.నాగరాజారావు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రెహంతుల్లా

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తాళ్లరేవు: టెక్ టీమ్ సొల్యూషన్స్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆంధ్రా టెక్ లీగ్-2023 పోటీల్లో తాళ్లరేవు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు స్కూల్ హెచ్ఎం జొన్నాడ ఆశాలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 3డి నిర్మాణ్ విభాగంలో కె.సత్యచరణ్, జె.సాయి వీర వెంకటలక్ష్మి, బి.కీర్తిలు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించారన్నారు. అలాగే చిట్టి ప్రో(రోబోటిక్స్) విభాగంలో అశ్విన్ ప్రశాంత్, బందారు వీరబాబులు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతిని సాధించారన్నారు. పోటీల్లో రాణించిన విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ పుల్లేటి కిషోర్‌ను హెచ్ఎం ఆశాలత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు అందుకున్న తాళ్లరేవు విద్యార్థులు

పేద మహిళలకు చీరల పంపిణీ

ఉప్పలగుప్తం: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ జన్మదిన వేడుకల సందర్భంగా ఉప్పలగుప్తంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, ఉప సర్పంచ్ మోకా శ్రీను సమకూర్చిన చీరలను 100 మంది పేద మహిళలకు పినిపే శ్రీకాంత్ పంపిణీ చేశారు. మండలంలోని ఉప్పలగుప్తం, చల్లపల్లి, గొల్లవిల్లి గ్రామాల్లో మంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, చిక్కం బాల సుబ్రహ్మణ్యం, అడబాల మాధవ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్ తదితరులు

ఉత్సాహంగా స్వచ్ఛతా అభియాన్ ఫ్లాగ్ రన్

యానాం: స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఫ్లాగ్ రన్ ఉత్సాహంగా జరిగింది. జీఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన పరుగు 3 కిలోమీటర్ల మేర సాగింది. ఈ సందర్భంగా మార్గం మధ్యలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను క్రీడాకారులు తొలగించారు. కార్యక్రమంలో శాయ్ ఇన్‌చార్జి జి.లింగేశ్వరరావు, పలువురు అథ్లెట్‌లు, కోచ్‌లు పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న క్రీడాకారులు

సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలి

తాళ్లరేవు: ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు అన్నారు. మండలంలోని జార్జిపేట ఎంఎల్‌కే నగర్‌లో దంగేటి సత్యనారాయణ ఏర్పాటుచేసిన అమ్మ-నాన్న ఆర్వో ప్లాంటును సోమవారం వారిద్దరూ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో సురక్షితమైన తాగునీరు తాగకపోవడం వల్లే అనేకమంది వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కురసాంపేట ఉజ్జీవ మందిరం పాస్టర్ పొన్నాడ జోసెఫ్, జార్జిపేట వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డి నాగేశ్వరరావు, పెట్ల సూర్యనారాయణరాజు, కుడుపూడి మల్లేష్, డి.జగదీశ్వరరావు, శీలి రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతికి సంతాపం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్ల సంఘం సభ్యుడు ఈసకోన శ్రీనివాసరావు మృతికి సంఘ ప్రతినిధులు స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సోమవారం సంతాపం తెలియజేశారు. శ్రీనివాసరావు మృతికి సంతాప సూచికంగా మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు సెలవు ప్రకటించారు. సంఘ నాయకులు మట్టపర్తి రాము, మామిడిపల్లి సాయి, వెనుతురుపల్లి సుబ్బు, మాగాపు కామేశ్వరరావు, కోటిపల్లి బాపన్న తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి పింఛన్ అందజేత



వెంకటేష్‌కు పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ పెయ్యల మంగేష్ తదితరులు

తాళ్లరేవు: మండలంలోని కోరంగి పంచాయతీ సీతారామపురం బీసీ కాలనీకి చెందిన విత్తనాల వెంకటేష్‌కు రూ.10 వేల పింఛన్‌ను స్థానిక సర్పంచ్ పెయ్యల మంగేష్ సోమవారం అందజేశారు. వెంకటేష్‌కు రెండు కిడ్నీలు పాడవ్వడంతో ప్రభుత్వం ప్రత్యేక పింఛన్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో వెంకటేష్‌కు నగదును అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు పెస్సింగి తాతాజీ వర్మ, వలంటీర్ పెస్సింగి ఊర్మిళాదేవి, పెయ్యల శ్రీనివాస్, శివ, సతీష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అల్లవరం: పేరూరు నుంచి గోడిలంక వరకూ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో బెండమూర్లంక ఫీడర్ పరిధిలోని గోడి, గోడిలంక, గోడితిప్ప గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సర్పంచ్‌ల చిత్రపటాల ఆవిష్కరణ

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గ్రామ పంచాయతీలో 1956 నుంచి ఇప్పటివరకూ సేవలందించిన సర్పంచ్‌ల చిత్రపటాలను సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. మాజీ సర్పంచులు, సర్పంచుల వారసులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యేరుబండి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు నడింపల్లి ఉదయబాబు, తోట బాబ్జి, జలదాని కాశి, సొసైటీ అధ్యక్షుడు మామిళ్లపల్లి రాజారావు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

తాళ్లరేవు: కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక ప్రజా సంఘాల భవనం వద్ద కేవీపీఎస్ కన్వీనర్ విప్పర్తి శ్రీనివాస్ పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో కోకన్వీనర్ గోపాలకృష్ణ, తణుకు రాంబాబు, నేరేడిమిల్లి త్రిమూర్తులు, సుందరనీడి సత్యనారాయణ, అత్తిలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురి అరెస్ట్

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు గ్రామంలో కోడి పందాల శిబిరంపై దాడిచేసి ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3 వేల నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస కుమార్ సోమవారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్లు చెప్పారు.

నిరుద్యోగ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

తాళ్లరేవు: రాజమహేంద్రవరంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర నిరుద్యోగ సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం నాయకుడు టి.ఈశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద నిరుద్యోగ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అత్తిలి బాబూరావు, ఉంగరాల బూరిబాబు, కనకాల సత్తిబాబు, ఎస్.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని త్యాగాలు అజరామరం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- ఊరూరా గాంధీజీ జయంతి వేడుకలు



అమలాపురంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు



మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: దేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మాగాంధీ చేసిన త్యాగాలు అజరామరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులోని గాంధీ విగ్రహానికి సోమవారం ఉదయం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామగోపాల్, సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, బద్రి బాబ్జి, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి ఎస్పీ శ్రీధర్ నివాళి

స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన మహాత్మాగాంధీ జయంతి వేడుకల్లో గాంధీజీ చిత్రపటానికి జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసా మార్గంలో సత్యాగ్రహమే ఆయుధంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహనీయుడు గాంధీ అని ఎస్పీ శ్రీధర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, డీఎస్బీ సీఐ బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పురవీధుల్లో సద్భావన యాత్ర నిర్వహించారు. స్థానిక డివిజన్ తపాలా కార్యాలయంలో జరిగిన గాంధీ జయంతి కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ సలాది శ్రీధర్, హెడ్ పోస్ట్‌మాస్టర్ సాయికృష్ణ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లవరం: మండలంలోని గోడి సచివాలయంలో సర్పంచ్ తోట శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన మహాత్మాగాంధీ జయంతి వేడుకల్లో గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ కృషిని ఎమ్మెల్సీ కీర్తించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంపీటీసీ ఎస్.మౌనిక, ఎంపీడీఓ కృష్ణమోహన్, కాండ్రేగుల వాణీ అచ్యుతం, తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు

ఉప్పలగుప్తం: విలసవిల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో ఎంపీడీవో కేవీ ప్రసాద్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, కార్యదర్శి దాసరి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ కొండయ్య

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ పారిశుధ్య కార్మికులను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు సోమవారం ఘనంగా సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు.

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక గాంధీనగరం సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఎం.అనుపమ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు రేకాడి నరసింహమూర్తి, గుత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో మహాత్ముని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఐ.పోలవరం: మండలంలోని తిళ్లకుప్పలో ఉన్న గాంధీ విగ్రహానికి దంగుడుబియ్యం త్రిమూర్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. కేశనకుర్రు పంచాయతీ కార్యాలయం, మురమళ్ల పితానివారిపాలెం పాఠశాలల్లో గాంధీజీ జయంతి వేడుకలు జరిగాయి.

ముమ్మిడివరం: పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు కర్నీడి వెంకటేశ్వరరావు, టి.నాగరాజారావు, ఎ.సతీష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్టులో విజేతలైన విద్యార్థులకు సీఐ ఎస్.కొండయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చప్పిడి లక్ష్మణరావు, జీవీఎల్ నరసింహారావు, ఎస్.అబ్బులు పాల్గొన్నారు.

యానాం: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక బొటానికల్ గార్డెన్స్‌లోని నిలువెత్తు గాంధీ కాంస్య విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని స్థానిక ఫెర్రీరోడ్డులోని ఆయన విగ్రహానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



విలసవిల్లిలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి తదితరులు



ఎస్పీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్